క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

ఐనవోలు : మండలంలోని కస్తూర్బా బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో ఖాళీగా ఉన్న వాచ్ ఉమెన్ పోస్టును భర్తీ చేయనున్నట్లు ఎంఈఓ ఆనందం సోమవారం ప్రకటనలో తెలిపారు. మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. కాంట్రాక్ట్ ప్రాతిపదికన నియామకం ఉంటుందని, 18 నుంచి 45 సంవత్సరాల్లోపు అభ్యర్థులు అర్హులని తెలిపారు. 10వ తరగతి ఉత్తీర్ణతతో పాటు ఏదైనా సెక్యూరిటీ ఏజెన్సీ ద్వారా శిక్షణ పొంది ఉండాలని, అభ్యర్థులు ఐనవోలు మండలానికి చెందినవారై ఉండాలని సూచించారు. అర్హత కలిగిన మహిళా అభ్యర్థులు దరఖాస్తులను ఈనెల 26 నుంచి 30వ తేదీలోపు ఎంఈఓ కార్యాలయంలో సమర్పించాలని పేర్కొన్నారు. వివరాలకు 94402 41860ను సంప్రదించాలని సూచించారు.

అసిస్టెంట్ కుక్ పోస్టుకు..

వేలేరు : మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో అసిస్టెంట్ కుక్ పోస్టు భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాశాఖ అధికారి చంద్రమౌళి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలానికి చెందిన 18 నుంచి 45 సంవత్సరాల నడుమ వయస్సు కలిగిన మహిళలు అర్హులని తెలిపారు. ఈనెల 30వ తేదీ సాయంత్రం 4 గంటల్లోపు మండల విద్యావనరుల కేంద్రంలో దరఖాస్తులు సమర్పించాలని తెలిపారు. వివరాలకు 9703963927కు సంప్రదించాలని కోరారు.

జాబ్ మేళాకు స్పందన



కమలాపూర్ : మండల కేంద్రంలోని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ స్వగృహంలో సోమవారం నిర్వహించిన జాబ్ మేళాకు స్పందన లభించింది. మండలంలోని పలు గ్రామాల నుంచి సుమారు 250 మంది నిరుద్యోగులు జాబ్ మేళాకు హాజరయ్యారు. ఐదు ప్రైవేట్ కంపెనీలు నిర్వహించిన ఇంటర్వ్యూలకు 160 మందిని ఎంపిక చేయగా 70 మందికి ఉద్యోగ అవకాశాలు లభించినట్లు ఆయా కంపెనీ ప్రతినిధులు పేర్కొన్నారు. మరో 90 మందికి శిక్షణ అనంతరం ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని వెల్లడించారు.

పాదయాత్రకు తరలిన కాంగ్రెస్ నాయకులు



ఆత్మకూరు : పాదయాత్రకు వెళ్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆత్మకూరు / శాయంపేట / ఎల్కతుర్తి : టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్, కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ చేపట్టిన పాదయాత్రకు సంఘీభావంగా ఆత్మకూరు మండల కేంద్రం, శాయంపేట మండలం నుంచి కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. వర్ధన్నపేటలో పాదయాత్ర కొనసాగుతుండగా ఆత్మకూరు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రమేష్, సొసైటీ మాజీ చైర్మన్ రవీందర్‌గౌడ్, వాసు, రాజు, శాయంపేట మండల అధ్యక్షుడు బుచ్చిరెడ్డి తరలివెళ్లారు. అదే విధంగా కరీంనగర్ జిల్లా చొప్పదండిలో చేపట్టనున్న పాదయాత్రకు వెళ్తున్న మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌ను ఎల్కతుర్తి మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు ఘన స్వాగతం పలికారు.

బైక్‌లు మాయం

ఆత్మకూరు : ఇంటి ముందు పార్కింగ్ చేసిన బైక్‌లు చోరీ అయ్యాయి. ఈ సంఘటన మండలంలోని పెద్దాపూర్, నీరుకుళ్ల గ్రామాల్లో చోటు చేసుకుంది. ఎస్సై తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దాపూర్ గ్రామానికి చెందిన చెంచు గణేశ్, నీరుకుళ్లకు చెందిన అర్షం లక్ష్మణమూర్తి తమ ద్విచక్రవాహనాలను ఆదివారం రాత్రి ఇళ్ల ముందు పార్క్ చేశారు. సోమవారం తెల్లవారుజామున చూసేసరికి కనిపించలేదు. సోమవారం ఇరువురు బాధితులు పోలీస్‌స్టేషన్‌లో వేర్వేరుగా ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు ఆయన చేస్తున్నట్లు పేర్కొన్నారు.

కృత్యాధార బోధనతో సత్ఫలితాలు

శాయంపేట : విద్యార్థుల్లో దాగివున్న ప్రతిభను వెలికితీసి కృత్యాధార బోధన ద్వారా విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించాలని ఎంపీడీఓ ఫణిచంద్ర అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని మండల వనరుల కేంద్రంలో మండల విద్యాశాఖ అధికారి గడ్డం భిక్షపతి అధ్యక్షతన నిర్వహించిన ప్రాథమికస్థాయి కృత్యమేళాను ఆయన ప్రారంభించారు. అతనంతరం మాట్లాడుతూ.. కృత్యాధార బోధనతో సత్ఫలితాలు పొందవచ్చన్నారు. ఎంపికైన 10 ఎగ్జిబిట్లను జిల్లాస్థాయిలో ప్రదర్శించనున్నట్లు తెలిపారు. ప్రధానోపాధ్యాయులు మాధవి, సారయ్య, శ్రీలత, జానర్దన్, శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు, సిఆర్పీలు అశోక్, వంశీ, శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

ప్రయాణం.. ప్రమాదం

- అడుగడుగునా మలుపులు
- అదుపుతప్పుతున్న వాహనాలు
- కరువైన సూచిక బోర్డులు
- పట్టించుకోని అధికారులు



కామారం-పెంచికలపేట రోడ్డులో ప్రమాదకరంగా ఉన్న మలుపు

ఆత్మకూరు : మండలంలోని కామారం గ్రామం నుంచి పెంచికలపేటకు వెళ్లే అంతర్గత బీటీ రోడ్డు మార్గంలో అడుగడుగునా మలుపులు ప్రమాదకరంగా మారాయి. 2కిలో మీటర్లలోనే ఆరు చోట్ల మలుపులు ఉండడంతో వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. రాత్రి వేళ ఈ మార్గంలో ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ మార్గం నుంచి మండల కేంద్రానికి, జిల్లా కేంద్రానికి అనేక మంది ద్విచక్రవాహనాలు, ఆటోల్లో వెళ్తుంటారు. అలాగే ప్రైవేటు పాఠశాలల బస్సులు కూడా ఈ మార్గంలో వెళ్తుంటాయి. మలుపులు ఉన్న చోట సూచక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని పలువురు అంటున్నారు. అధికారులు రేడియం స్టిక్కర్లు, బోర్డులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. మలుపుల వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు కనిపంచకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. వాహనచోదకులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని పలువురు వాహనదారులు అభిప్రాయపడుతున్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలని కోరుతున్నారు.

పంట క్షేత్రాలను పరిశీలించిన శాస్త్రవేత్తలు



పంటలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

శాయంపేట : మండల కేంద్రంలో రైతులు సాగుచేసిన పత్తి, కంది, వరి, మొక్కజొన్న పంటలను పరకాల ఏడీఏ శ్రీనివాస్, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన సంస్థ వరంగల్ శాస్త్రవేత్తలు సోమవారం పరిశీలించారు. పత్తి పంటలో టొబాకో స్ట్రీక్ వైరస్, తలమాడు తెగుళ్లు, తామర పురుగులు, పేనుబంక గమనించినట్లు శాస్త్రవేత్తలు తెలిపారు. వాటి నివారణకు ఇమిడా క్లోపరిడ్ ఐదు మిల్లీ లీటర్లు, తయామితాక్సమ్ 0.2 మిల్లీ లీటర్లు, పిప్రోనిల్ రెండు మిల్లీ లీటర్‌ను ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. కంది పంటలో గొడ్డుమోతు తెగులు అక్కడక్కడ కనించడంతో వాటి నివారణకు ఒక లీటర్ నీటిలో కరిగే గంధకాన్ని మూడు గ్రాములు కలిపి పిచికారీ చేయాలని సూచించారు. అనంతరం ఏడీఏ శ్రీనివాస్ మాట్లాడుతూ.. రైతులు పంటల్లో వచ్చే చీడపీడలను గమనించి తగిన పద్ధతులను పాటించాలన్నారు. చీడపీడల బారి నుంచి పంటలను కాపాడుకోవాలని సూచించారు. శాస్త్రవేత్తలు డాక్టర్ రాములు, డాక్టర్ గోనియానాయక్, డాక్టర్ పద్మజ, డాక్టర్ మధు, ఏఓ గంగాజమున, ఏఈఓ అర్చన, రైతులు పాల్గొన్నారు.

డ్రగ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీలు



ఎల్కతుర్తి : హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని పలు మెడికల్ షాపుల్లో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కిరణ్ సోమవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. మందులు, వాటి వివరాలను పరిశీలించారు. ప్రభుత్వ నిషేధిత టాబ్లెట్లను విక్రయిస్తున్న పలు మెడికల్ షాపుల యజమానులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నాణ్యమైన మందులు విక్రయించాలని, నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి



ఆత్మకూరు : మాట్లాడుతున్న సంజీవరెడ్డి



పరకాల : మాట్లాడుతున్న మధుసూదన్‌రెడ్డి

ఆత్మకూరు : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు లేతాకుల సంజీవరెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. మండలంలోని కొత్తగట్టు, మల్కపేట గ్రామాల్లో సోమవారం కార్యకర్తల సమావేశాలు నిర్వహించి మాట్లాడారు. బీఆర్ఎస్ కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను వివరించాలన్నారు. ఈ సమావేశంలో మండల ప్రధాన కార్యదర్శి బొల్లోజు కుమారస్వామి, మాజీ ఏఎంసీ చైర్మన్ కాంతాల కేశవరెడ్డి, నాయకులు రవియాదవ్, రాజేశ్వర్‌రావు, వంశీగౌడ్, మాజీ సర్పంచ్‌లు నరేష్, వేణు, కొమురయ్య, రామకృష్ణ పాల్గొన్నారు.

నడికూడ : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు గెలుపొందే విధంగా కార్యకర్తలు, నాయకులు కష్టపడి పనిచేయాలని మండల అధ్యక్షుడు దురిశెట్టి చందు అన్నారు. పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఆదేశాల మేరకు సోమవారం పులిగిల్ల, రాయపర్తి గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీ శ్రేణుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన కార్యకర్తలకు పలు సూచనలు చేశారు.

పరకాల : మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి హయాంలోనే నియోజకవర్గం అభివృద్ధి చెందిందని బీఆర్ఎస్ పరకాల మండల అధ్యక్షుడు చింతిరెడ్డి మధుసూధన్‌రెడ్డి తెలిపారు. మండలంలోని మల్లక్‌పేట, వెల్లంపల్లి గ్రామాల్లో జరిగిన బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. యూరియా కష్టాలను కాంగ్రెస్ ప్రభుత్వం తీర్చలేకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను విస్మరించి రైతులను, యువతను మోసం చేస్తోందని అన్నారు. బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, ప్రకాశ్‌రావు, మాజీ జెడ్పీటీసీ మొగిళి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

చెస్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



దామెర : హనుమకొండలోని టీటీడీ కల్యాణ మండపంలో సోమవారం నిర్వహించిన యునైటెడ్ వరంగల్ జిల్లా 3వ ర్యాంకింగ్ చెస్ టోర్నమెంట్‌లో మండలంలోని డిస్నీలాండ్ పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు ప్రిన్సిపాల్ సుధాకర్ తెలిపారు. సిద్ధంశెట్టి కిరణ్ (9వ తరగతి), దండిగం భానుప్రసన్న (8వ తరగతి)కి ట్రోఫీలు, సర్టిఫికెట్లు అందించి అభినందించారు. యాజమాన్యం మల్లయ్య, సదయ్య తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న క్రీడలు

ధర్మసాగర్ : మండలంలోని పెద్దపెండ్యాల డీపీఎస్ వరంగల్ సీబీఎస్ పాఠశాల ఆధ్వర్యంలో ఈనెల 23వ తేదీన ప్రారంభమైన అంతర పాఠశాల క్రీడా పోటీలు సోమవారం కొనసాగాయి. ఎన్ఐటీ డైరెక్టర్, ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ రవికుమార్ హాజరై విద్యార్థులకు క్రీడలపై పలు సూచనలు చేశారు.

మహేష్‌కుమార్‌గౌడ్ వ్యాఖ్యలపై మండిపాటు

- టీపీసీసీ అధ్యక్షుడి దిష్టిబొమ్మ దహనం



మహేష్‌కుమార్‌గౌడ్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

ఎల్కతుర్తి : కరీంనగర్ ఎంపీ, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌పై టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ చేసిన అనుచిత వ్యాఖ్యలు ఆయన అవివేకానికి నిదర్శనమని బీజేపీ నాయకులు మండిపడ్డారు. ఎల్కతుర్తి మండల కేంద్రం, భీమదేవరపల్లి మండలం ముల్కనూరులోని అంబేడ్కర్ చౌక్ వద్ద సోమవారం బీజేపీ నాయకులు మహేష్‌కుమార్‌గౌడ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల అధ్యక్షులు శ్రీకాంత్, పృథ్వీరాజ్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువవికాస పథకం అమలు చేయకుండా కాలయాపన చేస్తోందని విమర్శించారు. బండి సంజయ్ కరీంనగర్ జిల్లా అభివృద్ధికి సుమారు ఎనమిది వందల కోట్లు తీసుకువచ్చారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. బండి సంజయ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేదిలేదని హెచ్చరించారు. జిల్లా కౌన్సిల్ సభ్యుడు పృథ్వీరాజ్, నాయకులు కొమురయ్య, దుర్గంసింగ్, సాయి, రాణా, సంపత్, వైకుంఠం, నవీ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి



తహసీల్దార్ సత్యనారాయణకు వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

శాయంపేట : పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సత్యనారాయణకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి మంద శ్రీకాంత్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో సుమారు రూ.8,158 కోట్ల స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్లు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులు ఫీజులు చెల్లిస్తేనే సర్టిఫికెట్లు ఇస్తామని చెప్పడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇస్మాయిల్, జశ్వంత్, రాజుకుమార్, సిద్ధార్థ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రానైట్ క్వారీలను వెంటనే మూసివేయాలి

- కలెక్టరేట్‌లో స్థానికుల ఫిర్యాదు



అడిషనల్ కలెక్టర్ వెంకట్‌రెడ్డికి ఫిర్యాదు చేస్తున్న రైతులు

కమలాపూర్ : మండలంలోని వంగపల్లి గ్రామ శివారులో గల 95, 96, 97 సర్వే నంబర్లు, గుండేడు శివారులోని 71,72 సర్వే నంబర్లలో ఉన్న గ్రానైట్ క్వారీలను వెంటనే మూసివేయాలని కోరుతూ సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణిలో పంగిడిపల్లి రైతులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. మైనింగ్ వ్యాపారులు ప్రభుత్వం నుంచి అతి కొద్ది విస్తీర్ణానికి అనుమతి తీసుకుని పదింతలు భూమిని ఆక్రమిస్తున్నారని ఆరోపించారు. మైనింగ్ మాఫియా కారణంగా క్వారీని అనుకుని ఉన్న తమ వ్యవసాయ భూములకు సాగు నీరు అందక పంటలు ఎండిపోతున్నాయని, బ్లాస్టింగ్‌ల కారణంగా హెల్మెంట్లు పెట్టుకుని పొలం పనులు చేసుకోవాల్సి వస్తోందని తెలిపారు. క్వారీ, వాటి యజమానులతో తమకు ప్రాణభయం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. వంగపల్లి, గుండేడు గ్రామాల శివారులో ఉన్న క్వారీలను వెంటనే మూసివేసి యజమానులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు దేవసాని లక్ష్మీనారాయణ, సాయిలు, సాంబయ్య, బాలపురి కనుకరత్నం పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో మాక్ పోలింగ్



మాక్ పోలింగ్‌లో ఓటు వేసేందుకు క్యూలో నిల్చున్న విద్యార్థులు

ధర్మసాగర్ : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం మాక్ పోలింగ్ నిర్వహించారు. సోషల్ సైన్సెస్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఎన్నికల నియమావళిపై అవగాహన కల్పించారు. నామినేషన్ వేయడం, తిరస్కరణ, బ్యాలెట్ పేపర్ తయారీ, ఓటరు నమోదు, గుర్తింపు కార్డులు, సీక్రెట్ బ్యాలెట్ విధానం, కౌంటింగ్ ప్రక్రియ, గెలుపొందిన వారికి ధ్రువీకరణ పత్రం అందించే విధానంపై ప్రత్యక్షంగా తెలుపుతూ మాక్ పోలింగ్ నిర్వహించారు. అత్యధిక ఓట్లు సాధించిన రామ్‌చరణ్ స్కూల్ పీపుల్స్ లీడర్, మధుప్రియ డిప్యూటీ స్కూల్ పీపుల్స్ లీడర్ ,లాస్య, మనోజ్, భాను స్కూల్ క్యాబినెట్ సభ్యులుగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు. పాఠశాల ఇన్‌చార్జ్ ధర్మప్రకాశ్, ఉపాధ్యాయులు కవిత, సురేష్, పద్మజ, కిరణ్మయి, ప్రసన్న పాల్గొన్నారు.

మట్టి విగ్రహాలతో పర్యావరణ పరిరక్షణ



పరకాల : మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేస్తున్న మున్సిపల్ కమిషనర్ సుష్మ



ఆత్మకూరు : మాట్లాడుతున్న సీఐ సంతోశ్



దామెర : మాట్లాడుతున్న ఎస్సై అశోక్

- మున్సిపల్ కమిషనర్ సుష్మ

పరకాల : పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతి విగ్రహాలను ప్రతిష్ఠించి పూజించాలని పరకాల మున్సిపల్ కమిషనర్ సుష్మ సూచించారు. పరకాల మున్సిపాలిటీ కార్యాయల ఆవరణలో సోమవారం మట్టితో తయారుచేసిన గణపతి విగ్రహాలను కమిషనర్ పలువురికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్ ద్వారా తయారయ్యే విగ్రహాల వల్ల పర్యావరణంలోని జల కాలుష్యం ఏర్పడి పర్యావరణానికి ముప్పు కలుగుతుందని అన్నారు. ప్రజలు మట్టి విగ్రహాలను తయారు చేసి పూజించాలన్నారు. కార్యాలయ ఉద్యోగులు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో..

మట్టి విగ్రహాలను పూజించి పర్యావరణాన్ని కాపాడాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బేతి సంతోశ్‌కుమార్ పిలుపునిచ్చారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులచే మట్టి విగ్రహాలను తయారు చేయించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి అశోక్‌మోరె, అధ్యాపకులు డాక్టర్ కల్పన, డాక్టర్ పావని, రాజశ్రీ, డాక్టర్ స్వప్న, డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆత్మకూరు : గణపతి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వమించాలని సీఐ సంతోశ్ అన్నారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో గణపతి నవరాత్రి ఉత్సవ మండలి బాధ్యులతో సోమవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉత్సవాలను వైభవంగా జరుపుకోవాలని, శాంతిభద్రతలకు భంగం కలుగకుండా చూడాలన్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు ఎలాంటి పొరపాట్లు, ఇతరులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని అన్నారు. విద్యుద్దీకరణ, విగ్రహాల తరలింపులో జాగ్రత్తలు పాటించాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించొద్దన్నారు.

దామెర : గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గణపతి మండలపాలు ఏర్పాటు చేసే నిర్వాహకులు ఆన్‌లైన్‌లో అన్ని వివరాలతో అనుమతి పొందాలని ఎస్సై అశోక్ సూచించారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ సోమవారం గణపతి మండపాల నిర్వాహకులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. గణేశ్ మండపాలకు విద్యుత్ కనెక్షన్ కోసం విద్యుత్ అధికారుల అనుమతి తీసుకోవాని అన్నారు. నవరాత్రి ఉత్సవాల్లో డీజేలకు అనుమతి లేదన్నారు. ప్రజలు ఆనందోత్సవాలతో, భక్తిశ్రద్ధలతో నవరాత్రి ఉత్సవాలు జరుపుకోవాలని సూచించారు. పోలీస్ శాఖ పటిష్ట బందోబస్తు నిర్వహించనున్నట్లు చెప్పారు.

ఎన్నికల హామీలను విస్మరించిన కాంగ్రెస్

- బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండె విజయరామారావు
- తహసీల్దార్లకు వినతిపత్రాల అందజేత



ధర్మసాగర్ : వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ధర్మసాగర్ / వేలేరు : ఎన్నికల ప్రచారంలో ప్రజలకిచ్చిన హామీలు నెరవేర్చకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తుందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండె విజయరామారావు ఆరోపించారు. ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ధర్మసాగర్, వేలేరు మండల కేంద్రాల్లోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా విజయరామారావు మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు అనేక హామీలు ఇచ్చిందని, అధికారంలోకి వచ్చిన అనంతరం హామీలను విస్మరించిందని ఆరోపించారు. సన్నాలకు బోనస్ డబ్బులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. యూరియా కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని, మహాలక్ష్మి పథకం ద్వారా మహిళల ఖాతాల్లో రూ.2,500 జమ చేయాలన్నారు. సీనియర్ నాయకులు యుగేందర్, అమరేందర్‌రెడ్డి, సంపత్, రాములు, వెంకటేష్, మండల ప్రధాన కార్యదర్శులు శివప్రసాద్‌రెడ్డి, సందీప్, నాయకులు అనిరుధ్ కౌండిన్య, సాంబరాజు తదితరులు పాల్గొన్నారు.

కమలాపూర్ : మండలంలో నెలకొన్న వివిధ సమస్యలను పరిష్కరించాలని బీజేపీ నాయకులు సోమవారం తహసీల్దార్ సురేష్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం మండల కేంద్రంలో బైక్ ర్యాలీ చేపట్టారు. బీజేపీ మండల ఇన్‌చార్జ్ కందుల శ్రీనివాస్‌రెడ్డి, మండల అధ్యక్షుడు ర్యాకం శ్రీనివాస్ మాట్లాడుతూ.. మండల కేంద్రంలో ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణాన్ని గత ప్రభుత్వ హయాంలో మొదలు పెట్టినప్పటికీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్లు అవుతున్నా పూర్తి చేయలేదని దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కమలాపూర్-పంగిడిపల్లి రోడ్డు అధ్వానంగా మారిందని, హెచ్‌పీసీఎల్ గ్యాస్ ప్లాంట్‌కు వచ్చిపోయే భారీ వాహనాలతో రోడ్డంతా ధ్వంసమై కాలినడకకు కూడా వీలు లేకుండా పోయిందని అన్నారు.

బీజేపీ నాయకుల అరెస్ట్

ఐనవోలు : వర్ధన్నపేట నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ చేపట్టిన జనహిత పాదయాత్ర నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు అప్రమత్తం అయ్యారు. సోమవారం బీజేపీ నాయకులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. బీజేపీ మండల అధ్యక్ష, కార్యదర్శులు ప్రణయ్, రాజు, బీజేపీ యువ మోర్చా మండల అధ్యక్షుడు సాగర్ గౌడ్, రమేశ్ ఉన్నారు.

గొర్రెలకాపరులకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి



సర్వే నిర్వహిస్తున్న లింగయ్య

ఐనవోలు : ప్రమాదవశాత్తు మరణించిన గొర్రెల కాపర్లకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, ప్రభుత్వ భూములు లేని చోట ప్రభుత్వమే గొర్రెల, మేకల మేత కోసం పది ఎకరాల భూమిని కొనుగోలు చేయాలని గొర్రెల, మేకల పెంపకందారుల సంఘం హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి లింగయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో గొర్రెల, మేకల పెంపకందారులు ఎదుర్కొంటున్న సమస్యలపై సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వ భూములు, చెరువు సిఖం తుమ్మ చెట్లను గొర్రెలు, మేకల మేత కోసం కేటాయించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రభుత్వమే 10 ఎకరాల భూమిని కొనుగోలు చేసి సొసైటీలకు అందించాలని కోరారు. ప్రమాదవశాత్తు, కుక్కల దాడిలో గొర్రెలు, మేకలు మృత్యువాత పడుతున్నాయని, దీంతో కాపర్లు ఆర్థికంగా నష్టపోతున్నారని వెంటనే ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలన్నారు. పశువైద్యాధికారులు ఉదయం 8 గంటల నుంచి ఆస్పత్రుల్లో ఉండేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు చేరాలు, వెంకటయ్య, నాయకులు యాదగిరి, అనిల్, రాజు, సమ్మయ్య, అశోక్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

భజన మండలి సభ్యుల నగర సంకీర్తన



శాయంపేట : మండలంలోని పత్తిపాక గ్రామానికి చెందిన శ్రీరామాంజనేయ భజన మండలి సభ్యులు, శ్రీరామదాసు భజన మండలి జిల్లా అధ్యక్షుడు మాందాడి రాజు ఆధ్వర్యంలో సోమవారం గ్రామంలో నగర సంకీర్తన చేపట్టారు. శ్రావణమాసం ముగింపు సందర్భంగా ఉదయం 5 గంటల నుంచి 7 గంటల వరకు భక్తి గీతాలు ఆలపించారు. మహిళలు మంగళహారతులతో స్వాగతం పలుకుతూ స్వామివారి ఆశీర్వాదం పొందారు. సభ్యులు సదానందం, రాజు, కుమారస్వామి, రమేశ్, మహేందర్, సాంబరెడ్డి, రవి, ప్రభాకర్‌రెడ్డి, శంకర్, శ్రీధర్, రాంరెడ్డి గ్రామస్తులు పాల్గొన్నారు.

పరామర్శ

దామెర : కోగిల్వాయి గ్రామానికి చెందిన బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండి జితేందర్‌రెడ్డి తండ్రి మాధవరెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు విజయ్ చందర్, రాష్ట్ర అధికార ప్రతి నిధి సుధాకర్‌రెడ్డి, తదితరులు పరామర్శించారు.